




పరిగి నియోజకవర్గం ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున హాజరైన జనం, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. దళారీ రాజ్యం వస్తది

**నా కొడుకులాంటి మహేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి**

**పరిగి ప్రజాశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్**

- గెలిచిన నెలరోజుల్లోనే పరిగికి పాలిటెక్నిక్ కాలేజీ
- దాదాపూర్, కంకల్ మండలాలు చేస్తాం
- పరిగికి వచ్చి అన్ని పనులను పూర్తి చేస్తామని హామీ
- 52 తాండాలను జీపీలుగా చేస్తే.. గిరిజనులే ఏలుతున్నరు
- చౌడాపూర్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలుపుతాం



రూ.200 ఉన్న పింఛన్‌ను 2వేలకు పెంచామని, రానున్న రోజుల్లో రూ.5 వేలకు పెంచుతాం.. అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం పరిగి నియోజకవర్గం అభ్యర్థి మహేశ్‌రెడ్డికి మద్దతుగా పరిగి పట్టణంలోని జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగించారు. నా కొడుకులాంటి మహేశ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించండి. ఎన్నికల తర్వాత నెలరోజుల్లో పరిగి వచ్చి మీరు అడిగిన అన్ని పనులు పూర్తి చేస్తా.. 24 గంటల కరెంటు కంటిన్యూ చేస్తూనే.. రైతు బంధును రూ.16 వేలకు పెంచుతాం. ఎన్నికలు అనగానే ఆగం కావద్దు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు గ్రామాల్లో చర్చపెట్టాలి.., రాయేదో, రత్నమేదో ప్రజలకు తెలిసేలా వివరించాలి. వజ్రాయుధం లాంటి మీ ఓటు పరిగి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

వికారాబాద్, నవంబర్ 22, (నమస్తే తెలంగాణ) : పరిగిలో పాలిటెక్నిక్ కాలేజీతోపాటు దాదాపూర్, కంకల్ మండలాలను ఏర్పాటు చేయాలని మహేశ్ రెడ్డి అడుగుతున్నారని, అవేమీ గొంతెమ్మ కోరికలు కావని, గెలిచిన నెలరోజుల్లోనే చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. మహేశ్ రెడ్డి ప్రజల తరపున యుద్ధం చేస్తున్నారని, ఆయనకే మీరు ఓటేసి దీవించాలని కోరారు. పరిగి పట్టణంలోని జింఖానా గ్రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహేశ్ రెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ప్రజలు కోరుతున్నట్లు మహ్మదాబాద్, చౌడాపూర్ మండలాలను ప్రజల కోరిక మేరకు వికారాబాద్ జిల్లాలో కలుపుతామని చెప్పారు. స్వర్గీయ కొప్పుల హరీశ్వర్ రెడ్డి నేను 30 ఏండ్లు కలిసి పనిచేశామని గుర్తు చేశారు. స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యేతోనే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తదని, పరిగి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మహేశ్ రెడ్డి నిలబడ్డారని, అభ్యర్థుల గుణగణాలతోపాటు వారి వెనుకున్న పార్టీల గత చరిత్రను చూడాలని ప్రజలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ సభలో మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేశవరావు, స్పీకర్ మధుసూదనాచారి, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బొంతు రామ్మోహన్, నాగేందర్ గౌడ్, కొప్పుల అనిల్ రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

**పింఛన్ రూ.5వేలకు పెంచుతాం**

కాంగ్రెస్ హయాంలో పింఛన్ కేవలం రూ.200 మాత్రమే ఉండేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదట రూ.వెయ్యి, తర్వాత రూ.2 వేలకు పెంచింది. రానున్న ఎన్నికల్లో గెలిచిన తర్వాత రూ.5 వేలకు పెంచుతామని సీఎం హామీనిచ్చారు.

### 52 తాండాలను పంచాయతీలుగా చేశాం

నియోజకవర్గంలో మహేశ్‌రెడ్డి పట్టుబట్టి 52 తాండాలను గ్రామ పంచాయతీలుగా చేయించారని, గిరిజన బిడ్డలే ఇయ్యాలా రాజ్యం ఏలుతున్నారని సీఎం కేసీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ఉన్నప్పుడు లాంబాడాలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఏం చేయలేదన్నారు.

### రైతుబంధును పుట్టించిందే కేసీఆర్

గర్భిణులకు అమ్మవడి వాహనాల ద్వారా ఇంటి నుంచి ఆసుపత్రికి తీసుకొచ్చి మళ్లీ ఇంటి దగ్గర జాగ్రత్తగా చేరుస్తున్నామన్నాని, ప్రసవం తర్వాత ఆడబిడ్డ పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేల సాయంతోపాటు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను విజయవంతంగా అమలు చేస్తున్నామని, 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని, చరిత్రలో ఎప్పుడు వినని రైతు బంధును పుట్టించిందే కేసీఆర్ అన్నారు. కొప్పుల మహేశ్ రెడ్డిని గెలిపిస్తే రైతుబంధు ఉండుడే కాదు.. రూ.16 వేలకు పెంచుతామని సీఎం హామీనిచ్చారు. రైతు తన సొంత పెట్టుబడితో వ్యవసాయం చేసుకునే రోజు బంగారు తెలంగాణ అని, నేను కలగనేది అదే అన్నారు.



సభా వేదికపై ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పరిగి నియోజకవర్గం నాయకులు

## పులకించిన పరిగి

- ఆశీర్వదించేందుకు.. దండిగా తరలివచ్చిన గులాబీ దండు
- ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్
- బీఆర్‌ఎస్ శ్రేణులలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపిన ముఖ్యమంత్రి ప్రసంగం

పరిగి, నవంబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పరిగిలోని జింఖాన మైదానంలో పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం మరింత రెట్టింపు అయ్యింది. నియోజకవర్గంలోని పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. సీఎం కేసీఆర్ పరిగికి చేరుకోకముందే సభాస్థలి పూర్తిగా జనంతో నిండిపోయింది. సభలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రసంగంలో ప్రస్తావించిన పలు అంశాలు బీఆర్‌ఎస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడం, రిజర్వేషన్‌లు 10శాతానికి పెంచడం వంటివి సీఎం కేసీఆర్ వివరించిన సమయంలో చప్పట్లు కొట్టి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కరెంటు ఎన్ని గంటలు ఉండాలంటే 24 గంటలు ఉండాలని, ధరణి కొనసాగాలని సభికులు సీఎం కేసీఆర్‌కు మద్దతు పలికారు. మహేశ్‌రెడ్డివి గొంతెమ్మ కోరికలు కావని, మహేశ్‌రెడ్డిని గెలిపించండి వంద శాతం ఎన్నికల తర్వాత నెల రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

## హరీశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సీఎం కేసీఆర్



పరిగి, నవంబర్ 22 : ఇటీవల మృతిచెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను సీఎం కేసీఆర్ పరామర్శించారు. బుధవారం పరిగిలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్ హెలిప్యాడ్ దగ్గర నుంచి నేరుగా హరీశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం హరీశ్వర్‌రెడ్డి సతీమణి గిరిజారెడ్డిని సీఎం కేసీఆర్ పరామర్శించి ధైర్యం చెప్పారు.

## డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేశాం

పరిగి, నవంబర్ 22 : పరిగి నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ రెండు కొత్త మండలాలు ఇవ్వడంతోపాటు పలు హామీలు నెరవేర్చారని పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. 2018లో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చి పరిగి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించారని అన్నారు. మరోసారి తనకు అవకాశం ఇవ్వడంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని చెప్పారు. పరిగి ప్రజలు డిగ్రీ కళాశాల కోసం 30 ఏండ్లుగా ఎదురుచూస్తున్న వారి కల నెరవేరిందని, మహ్మదాబాద్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు కల సైతం నెరవేరిందని అన్నారు. 15 గ్రామాలకు రోడ్లు లేవని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళితే సొంత నిధులు మంజూరు చేశారని, 34 గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్లు మంజూరు చేశారని తెలిపారు. పరిగిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, కులకచర్లలో ఐటీఐ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. గండీడ్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపాలన్నారు. దాదాపూర్, కంకల్ రెండు నూతన మండలాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు.